# స్త్రీ స్వాతంత్ర్యం

శ్రీ జరుగుబిల్లి
సాంబశివరావు

‘ఓ భారత నారీమణులారా! ఓ సోదరీ మణులారా! మనకు కావల్సింది ఒక్కటే- అదే స్త్రీస్వాతంత్ర్యం! ... మనంగూడ మనుష్యులమే. మనంగూడ జీవులమే. మనకూ బొంది, బొందిలో ప్రాణాలు ఉన్నాయి’ అని నిర్మల అనేసరికి సభలో ఒక్కసారి హర్షధ్వానాలు మిన్నుముట్టినై.

ఒక్కసారి బల్లగుద్ది “సైలెన్సు! సైలెన్సు! ఈ పురుషులకు స్త్రీలంటే అంత అసహ్యంగాఉంది. ‘స్త్రీఅంటే ప్రాణంలేని బొంది’ అని వీరి అభిప్రాయం. ఎలా పడితే అలా పురుషునిచేతిలో ఆడే కీలుబొమ్మ అని వారి ఉద్దేశం. తమదే పైచేయి అన్ని విధాలా....”

“దాన్ని మనం సహించలేము-సహించం-సహించగూడదుకూడ. మనకూ స్వాతంత్ర్యంఉంది. మనమూ పురుషులతో సహా భారతమాత కడుపునపుట్టిన వారమే.”

“ఇదిగో! ఓసోదరీ మణులారా! ఒక్కటేమాట - పురుషులు ఏమైనా మనపైన దౌర్జన్యాలుసాగిస్తే ప్రతిస్త్రీ ఎదుర్కోవాలి- ఎదిరించాలి- బెదిరించాలి- భర్త పెడత్రోవ త్రొక్కితే భర్తను సరిదిద్దే అధికారం ప్రతి స్త్రీకిఉంది. ప్రతిస్త్రీ తనభర్త పెడత్రోవ త్రొక్కితే సహించకూడదు. ఎదుర్కోవాలి- ధిక్కరించాలిగూడ సమయంవస్తే.”

“భార్యాభర్తలు కలసిమెలసి ఉండాలి అన్యోన్యప్రేమతో. ఆనాడే మనకు శాంతి. ఆనాడేసుఖం....ఆనాడే సౌఖ్యం....”

అని ఒక్క దీర్ఘోపన్యాసం ఇచ్చేసరికి అందరూ హర్షధ్వానాలు చేసేరు- “మహిళా మండలికి జై. నిర్మలాదేవికి జై” అనే హర్షధ్వానాలు మిన్నుముట్టినై—

అంతటితో మహాసభ ముగిసింది.

* * *

సరిగ్గా గోడగడియారం 8 గం॥ కొట్టింది. ఆనందరావు “నిర్మలా! ఏదీ కాఫీతీసుకురా” అన్నాడు న్యూస్ పేపరు చదువుతూ.

నిర్మల కాఫీతీసుకువచ్చి ఎదురుగా నిలబడింది.

“చూశావా! నిర్మలా! ఈవైపరీత్యం! ఈమహిళామండలివాళ్లు చూడగా చూడగా మాకొంప పీకేటట్లున్నారు. పురుషులతో యుద్ధానికే వస్తారు కాబోలు!” అన్నాడు పేపరు చదువుతూ.

“అవును. నిజమే....మరి. మగాళ్ల నడవడి బాగులేకపోతే ఏంచేస్తారు మరి. మీకు తాం? మీకి చూపెడతారా....?”

“ఓహోహో! బలేబాగుందే! నువ్వు చెప్పేది... ఈ ఆడవాళ్లు ఏదో ఇంతతిని... పడుకోడం మానేసి మీటింగులూ....రిజల్యూషన్లూ,...ఆఁ.”

"అవునండీ. ఏంచేస్తారు మరి...నిజంగా మీమగవారు ఎన్నివిధాలుగా మాఆడ వార్ని హీనంగా చూస్తున్నారు...అన్ని విధాల బాధిస్తున్నారు. ఏంచేసినా ఎంత కాలం సహించి ఊరుకొంటాము ? అనేసరికి వీధిలోనుంచి "ఆనందరావు గారు" అంటూ పిలుపు వినబడింది...

వెంటనే ఆనంద్ పైకివచ్చి తలుపుతీసేడు.

"మీరు తప్పకుండా సాయంత్రం రావాలి సుమండీ! మా సెట్టిగారు ప్రత్యేకంగా మీతో చెప్పమన్నారు. నిజంగా పద్మడాన్సు ఏమిటండీ....అద్భుతంగా ఉంటుంది' ఒక పెద్దమనిషి ఇన్విటేషను ఇచ్చిపోయాడు.

సాయంకాలం ఆనంద్ మిస్. పద్మ డాన్సుకివెళ్లి, వచ్చి, రాత్రిపడుకున్నాడు— రాత్రి 10 గంటలయింది. ఇంకా నిద్దుర పట్ట లేదు.

"ఏం, ఒక్కసారి దానింటికి వెళ్లినంత మాత్రాన్న తప్పేమిటి ?"

"అదీకాక నిజంగా...పద్మఅందాలరాశి, ...నిండు యౌవనవతి....సౌందర్య స్వరూ పిణి....రూపవతి...నిజంగా ఆమెతో అప్ర ణయ సామ్రాజ్యంలో తన్మయం చెందడం కంటె ఇంకొకటి ఏంకావాలి మనకి ?"

"ఛా. ఛా...దానింటికా వెళ్లడం... మనం ఇంతో అంతో ఉద్యోగం చేసుకుం టున్నాము. గౌరవంగా జీవనం సాగి స్తున్నాం - మనం అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యఉంది...ఇంతకన్నా చిన్నతనమైనపని ఇంకొకటి ఉందా..."

చివరకి వెళ్ళాలని నిశ్చయించు కొన్నాడు.

ఆ మర్నాటినుంచీ ఆనంద్ రోజూ పద్మ ఇంటికి వెళ్లడం అలవాటైపోయింది. భార్య ఊసే తలపెట్టడంలేదు. తరచుగా నిర్మలతో మాట్లాడడమే మానివేశాడు.

ఒకరాత్రి 11 గంటల సమయం చర చరా ఆనంద్ గదిలోనుంచి వచ్చి వీధి తలు పులు తీస్తున్నాడు.

నిర్మల ఇదంతా కనిపెడుతూనే ఉంది. ముఖం విచారాన్ని సూచిస్తూంది. అశ్రు జలధారలు వడివడిగా ప్రవహిస్తున్నాయి. వెంటనే అడ్డుగా నిలబడింది ఆనందుకు.

"లే అడ్డం" అంటూ దమాయించు కొని, నిర్మలను క్రిందికి తోసేసేడు. తాను పైకి వెళ్ళిపోయేడు.

నిర్మల విచారానికి అంతులేదు. అలా ఆలోచిస్తూ పడుకుంది ఆరాత్రి. ఆరోజు తాను అన్నమాటలు ప్రతిధ్వనిస్తున్నాయి చెవిలో.

"భర్త పెడత్రోవత్రొక్కితే, భర్తను సరిదిద్దే అధికారం ప్రతి స్త్రీకి ఉంది."

చెవిలో ఆ ప్రతిధ్వని అధికమై పోతూంది. "సరే మన ప్రయత్నం మనం చేద్దాం" అనుకొని నిద్రపోయింది.

ఆమర్నాడునుంచి ముందుగా తానే ఆనంద్‌తో మాటలాడడం మానేసింది. అసలు ఎదురుగా కనబడడమే మానేసింది.

"ఏం భోజనం పెట్టడం లేదేమిటి?" అన్నాడు ఆనంద్, ఒకనాడు మధ్యాహ్నం.

"ఇవాళ వంటలేదు!" "ఏం వండక ఏం చేస్తున్నావు?"

"ఒంట్లో బాగులేదు."

"ఏడ్సినట్లే ఉందిలే! తిండితినకపోతే ఎలా అఘోరించమన్నావు?"

అని కోపంతో ఆనంద్ పైకిపోయాడు.

ఇక, ఆరోజునుంచీ ఇంట్లో వంటైనా చేయడం మానేసింది. ఇదంతా ఎందుకు పాపం! తన భర్త తనకు స్వాధీన మవుతాడని, కాని ఆమర్నాడునుంచీ ఆనంద్ ఇంటివైపే చూడ్డం మానేశాడు. తన టైము అంతాగూడ పద్మతోనే గడపడం మొదలెట్టేడు.

కొన్నాళ్లు గడిచింది.

ఆనంద్‌కు క్షయవ్యాధి ప్రవేశించింది. మనిషంతా చిక్కి శల్యమయేడు. అప్పటి దాకా ఆనంద్ అంటే ప్రేమతో ఉన్న పద్మకు ఆనాటితో అనంద్ అంటేఅసహ్యం పుట్టింది.

"క్షయవ్యాధితో గూడ మమ్మల్ని చంపుతావేమిటి? పో! నీపెళ్ళాం దగ్గరకు." అంది. కోపంతో.

"పెళ్ళాం ... ఇంకెక్కడి పెళ్ళాం ... ఆనాడే దానికీ, నాకు సంబంధం తీరిపోయింది. పద్మ ... అంతా నువ్వేగా ..."

"ఛీ, నీకూ నాకు సంబంధం యేమిటి? నిన్ను నేనేం పెళ్ళిచేసుకొన్నానా? నీవు నాకు డబ్బిచ్చి నంతకాలం ప్రేమించేను, నీవు ఆరోగ్యంగా ఉండేవాడివి కాబట్టి నీతో ఉండేదాన్ని..."

"ఇంతకీ నీతోబాటు ఆరోగంతో నన్ను గూడ చావమన్నావా? ఇప్పుడు నువ్వు ఇక్కడ ఒక్క-రోజయినా ఉండడానికి వీల్లేదు. పోతావా? పోవా ..."

"ఇంతేనా ... పద్మా .. పద్మా ..."

"ఇంతేకాకపోతే మరేమిటి? పో."

ఆనంద్‌కు మతిపోయింది. ఏంచేయడానికి ఏమీ తోచలేదు. నమ్ముకున్న పద్మ ఇలా చేసింది. ఇక, తన భార్య చూస్తుందా ...? మెల్లిగా చేరాడు ఇంటికి.

"నిర్మలా ... నిర్మలా ... క్షమించు .. నన్ను క్షమించు ...నీకు తీరని అన్యాయం చేసేను ... నన్ను క్షమించవూ" అని ప్రాధేయ పడ్డాడు.

నిర్మల, ఆనంద్‌ను చూసి ఎంతోకాలం అయింది. ఎప్పటికైనా తిరిగి వస్తాడా అని వర్షపు నీటికి, ముత్యపు చిప్పలాగ కనిపెట్టుకొని ఉంది.

వెంటనే చూసింది ఆనంద్‌ను, కన్నీటి తరంగాల్లో ఊగులాడుతూ, "మీరేనా...? ఏం ఇలా అయిపోయారు..?" అని ఒక్కమారు కౌగలించుకుంది.

వెంటనే ఆనంద్‌ను హాస్పటల్‌లో చేర్పించి, చికిత్స చేయించింది. ఆనంద్ జీవించేడు.

ఇద్దరూ సుఖంగా ఉన్నారు.